AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
16-9-2025 (Tuesday)
MAIN EDITION

## షిప్‌యార్డ్‌లో అప్రెంటిస్ అవకాశాలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ప్రభుత్వరంగ సంస్థ అయిన కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు చేపట్టింది. వీటిని ఒప్పంద ప్రాతిపదికన గ్రాడ్యుయేట్ అప్రెంటిస్, టెక్నిషియన్ అప్రెంటిస్‌లను తీసుకోనుంది. ఇందుకోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం 140 పోస్టులను భర్తీ చేయనుంది. ఇంజినీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులు. ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు https://cochinshipyard.inలో సంప్రదించవచ్చు.

## మెట్రో స్టేషన్‌లో పాస్‌పోర్టు సేవా కేంద్రం



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** రాష్ట్రంలో మరో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్ లోపల పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో ఈ సేవా కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలోని పాస్‌పోర్టు కేంద్రాల సంఖ్య ఐదుకు చేరుకుంది. బేగంపేటలో ప్రధాన కార్యాలయం ఉంది. తాజాగా ఎంజీబీఎస్‌లో ఈ సేవా కేంద్రం ఏర్పాటు చేశారు.

# స్థానిక సమరం
# సాగేనా.. ఆగేనా?



**స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధం కొనసాగుతోంది. గడువులోపు ఎన్నికలు నిర్వహించడం అనుమానంగానే కనిపిస్తోంది. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో స్పష్టత కరువవడం, రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకపోవడం, ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని గతంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం విధించిన గడువు ముంచుకొస్తున్న తరుణంలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎన్నికలు నిర్వహించడంపై సందేహాలు నెలకొన్నాయి. దీంతో అన్ని రాజకీయ పార్టీల్లోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్లపై తీవ్ర సందిగ్ధత కొనసాగుతున్న తరుణంలో ప్రభుత్వం గడువు పొడిగించాలని హైకోర్టును ఆశ్రయించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ దగ్గరపడుతున్న గడువు.. తేలని రిజర్వేషన్లు.. ■ కోర్టు ఇచ్చిన సమయానికి మిగిలింది 15 రోజులే..

హైకోర్టు విధించిన గడువుకు మరో 15 రోజులు మాత్రమే మిగిలి ఉంది.
ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ జారీ చేసి, ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి ఈ 15 రోజులు సరిపోదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణకు కనీసం నాలుగైదు రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక, నామినేషన్ల పర్వం పూర్తయిన తర్వాత ప్రచారం కోసం కనీసం వారం రోజుల వ్యవధి తప్పనిసరి. ప్రస్తుత పరిస్థితుల్లో 15 రోజుల గడువు సరిపోదన్న భావన నెలకొంది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించడానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లతో పాటు భద్రత ఏర్పాట్లు చేయాలి. ఈ పరిస్థితుల్లో ఇప్పటికప్పుడు ఎన్నికలు జరపడం సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### రిజర్వేషన్లే కీలకం..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రధానంగా రిజర్వేషన్ల అంశం అడ్డంకిగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపింది. అయితే, రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో.. గవర్నర్ ఈ దస్త్రాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల బిల్లు పెండింగ్‌లో పడడంతో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని జీవో జారీ చేసింది. అయిదే, ఈ జీవో చట్టబద్ధతపై సందేహాలు నెలకొన్నాయి. ఎవరైనా కోర్టుకు వెళ్తే జీవోను కొట్టేసే అవకాశముండడంతో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఎన్నికలు నిర్వహించడానికి ఈసీకి లేఖ రాసినప్పటికీ, పూర్తి స్థాయిలో సన్నాహాలు చేపట్టడం లేదు.

### కనిపించని హడావుడి..

వాస్తవానికి ఏదైనా ఎన్నిక వస్తుందంటే రాజకీయ పార్టీల హడావుడి మామూలుగా ఉండదు. అలాంటిది స్థానిక సంస్థల ఎన్నికలంటే క్షేత్ర స్థాయిలో మరింత హడావుడి ఎక్కువగా ఉంటుంది. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల జోష్ కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత లేకపోవడంతో అధికార పార్టీతో సహా మిగతా పక్షాలు సైతం సైలెన్స్‌గా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఎన్నికపైనే దృష్టి సారించిన ప్రధాన పార్టీలు.. స్థానిక ఎన్నికలపై పెద్దగా ఫోకస్ చేయడం లేదు. మరోవైపు, మొన్నటిదాకా గ్రామాల్లో హడావుడి చేసిన ఆశావాహులు సైతం ప్రస్తుతం సైలెంట్ అయ్యారు. త్వరగా ఎన్నికలు జరుగుతాయని ఇప్పటికే చాలా ఖర్చు చేశామని, కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కనిపించడం లేదని ఆశావాహులు వాపోతున్నారు. నోటిఫికేషన్ వచ్చే వరకూ సైలెంట్‌గా ఉండడమే మేలన్న భావనతో పెద్దగా జనంలోకి రావడం లేదు.

## శాంసంగ్ నుంచి కొత్త ఫోన్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ అయిన శాంసంగ్.. గెలాక్సీ ఎఫ్ 17 పేరుతో కొత్త మోడల్‌ను తీసుకువచ్చింది. ఆరు జనరేషన్ల ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడ్స్, ఆరేళ్లపాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రకటించింది. శాంసంగ్ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఫోన్ అందుబాటులో ఉంది. 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లేతో వస్తోంది. 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ, 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ వేరియంట్స్ ఉన్నాయి. వైలెట్ పోప్, నియో బ్లాక్ కలర్లలో లభ్యం కానుంది. ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులతో ఐదు శాతం వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుంది.

## భారీగా ఐటీ రిటర్నులు..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఐటీ రిటర్న్‌లకు సోమవారంతో గడువు ముగిసింది. చివరి రోజు భారీగా ఆదాయపన్ను రిటర్నులు దాఖలయ్యాయి. ఈసారి రికార్డు స్థాయిలో 7.3 కోట్లకు పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలయ్యాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. గత సంవత్సరం 7.28 కోట్లను దాటి ఈసారి అంతకంటే అధిక స్థాయిలో దాఖలయ్యాయని తెలిపింది. 2025 - 26 అసెస్‌మెంట్ ఇయర్ కోసం ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి మంగళవారం వరకు పొడిగించింది.

## విద్యుత్ శాఖ ఏడీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. నగరంలోని 18 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం బృందాలుగా ఏకకాలంలో దాడులు చేపట్టారు. మణికొండ ఏడీఈగా పని చేస్తున్న అంబేద్కర్‌పై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందింది. దీంతో ఏకకాలంలో సోదాలు చేశారు. రూ. 2 కోట్ల నగదును గుర్తించారు. రూ. 200 కోట్ల వరకు అక్రమాస్తులు కూడబెట్టినట్లు తెలుస్తోంది.

### బినామీ ఇంట్లో రూ.రెండు కోట్లు


ఏడీఈ అంబేద్కర్ బినామీ సతీష్ ఇంట్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ. 2 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా దాడులు కొనసాగుతున్నాయి. అలాగే మిగతా వారి ఇళ్లలో దొరికిన నగదు, బంగారు ఆభరణాల వివరాలను అధికారులు లెక్కిస్తున్నారు. ఏడీఈకి మొత్తం రూ. 200 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు సమాచారం. దాడుల్లో భారీగా కమర్షియల్, వ్యవసాయ భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్, గచ్చిబౌలితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో 18 ఏసీబీ బృందాలు దాడులు చేశారు. త్వరలోనే ఏసీబీ అధికారులు దాడులకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించనున్నారు.

## ‘బ్రెయిన్ ఈటింగ్’ వైరస్ కలకలం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** దేశంలో మరోసారి అత్యంత ప్రమాదకర వైరస్ కలకలం సృష్టిస్తోంది. మెదడును నాశనం చేసే ప్రమాదకరమైన ‘బ్రెయిన్ ఈటింగ్ అమీబా’ మరోసారి కేరళ రాష్ట్రాన్ని భయబ్రాంతులకు గురిచేస్తోంది. తాజాగా తిరువనంతపురంలోని అక్కులం టూరిస్ట్ విలేజ్ పూల్‌లో ఈత కొట్టిన 17 ఏళ్ల బాలుడికి ఈ వైరస్ సోకినట్లు పరీక్షల్లో తేలింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడు ఇటీవల టూరిస్ట్ విలేజ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత తీవ్రమైన తలనొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలతో ఆస్పత్రిలో చేరాడు. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో "నెగ్లేరియా ఫోలేరి" అనే అమీబా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు సమాచారం. కేరళలో ఇప్పటివరకు 67 కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ వల్ల 18 మంది మరణించారు. ఈ వైరస్ అత్యంత ప్రమాదకరమైనదిగా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## డెహ్రాడూన్‌లో క్లౌడ్ బరస్ట్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షం విధ్వంసం సృష్టించింది. తామ్సా నదికి భారీ వరదలు పోటెత్తి తీరప్రాంతంలోని ఇళ్లు, దుకాణాలను ముంచెత్తింది. భారీ ఆస్తి నష్టం సంభవించింది. రంగంలోకి దిగిన ఎస్డీఆర్ఎఫ్ వరదల్లో చిక్కుకున్న ముగ్గురిని రక్షించింది. అలాగే, దుర్బల ప్రాంతాల నుంచి 400 మంది నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రఖ్యాత తపకేశ్వర్ మహాదేవ్ ఆలయం వరదలకు గురైంది. రోడ్లు కొట్టుకుపోయాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామికి ఫోన్ చేసి పరిస్థితిపై ఆరా తీశారు. కేంద్రం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## సివిల్ సర్వీసెస్ అధికారిణి ఇంట్లో నోట్ల కట్టలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో అవినీతి అధికారులకు కొదవ లేకుండా పోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లోని అటెండర్ నుంచి మొదలు పెడితే సివిల్ సర్వీసెస్ అధికారుల వరకు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఓ సివిల్ సర్వీసెస్ అధికారిణి ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఆమె ఇంట్లో నోట్ల కట్టలు, బంగారు ఆభరణాలు చూసి తనిఖీలకు వెళ్లిన అధికారులే షాక్ అయ్యారు. అస్సాంకు చెందిన సివిల్ సర్వీస్ అధికారిణి నుపుర్ బోరాపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆమె కమ్రూప్‌లో సర్కిల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. 2019లో అస్సాం సివిల్ సర్వీసులో చేరారు. గువాహటికి చెందిన ఆమెపై భూ కుంభకోణానికి సంబంధించి ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆమెపై ఆరు నెలలుగా నిఘా ఉంచినట్లు సీఎం హిమంత బిశ్వశర్మ తెలిపారు.

## విద్యారుణాలపై వడ్డీ మాఫీ ప్రకటించిన నితీశ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో అక్కడి ఓటర్లపై వరాలు జల్లు కురుస్తోంది. ఇప్పటికే మహిళలు, ఉద్యోగులు, వివిధ వర్గాలపై వరాలు కురిపించిన ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తాజాగా యువతకు లబ్ధి చేకూర్చే ఆఫర్ ప్రకటించారు. స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్ కింద ఇచ్చే విద్యా రుణాలపై వడ్డీ మాఫీ చేయనున్నట్లు నితీశ్ మంగళవారం ప్రకటించారు. తాజా నిర్ణయంతో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు భారీ ఉపశమనం కలుగనుంది. “స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్ కింద ఇచ్చే విద్యా రుణం వడ్డీ లేకుండా ఉంటుందని తెలియజేయడానికి చాలా సంతోషంగా ఉన్నాను” అని నితీశ్ ‘X’లో పేర్కొన్నారు.

## యువరాజ్, ఉతప్పకు ఈడీ నోటీసులు

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇప్పటికే భారత మాజీ క్రికెటర్లు శిఖర్, సురేశ్ రైనాను విచారించిన ఈడీ.. ఇప్పుడు మరో ఇద్దరు మాజీ క్రికెటర్లకు నోటీసులు జారీ చేసింది. యువరాజ్‌సింగ్, రాబిన్ ఉతప్పలను విచారణకు రావాలని మంగళవారం నోటీసులు పంపించింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించడానికి సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 22న రాబిన్ ఉతప్పను సెప్టెంబర్ 23న యువరాజ్‌ను విచారణకు రావాలని సూచించింది.

## రష్మిక ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఫాం గురించి ఎంత చెప్పినా తక్కువే. బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా షాహిద్ కపూర్‌తో ఒక సినిమా ఫైనల్ అయినట్టు తెలుస్తోంది. కాక్‌టైల్ 2లో రష్మిక ఛాన్స్ అందుకుందని సమాచారం. ఆల్రెడీ ఆయుష్మాన్ ఖురానా సినిమాలో ఈ అమ్మడు నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా ఆమె ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్టు టాక్. కాగా.. కాంచన 4లో చిత్రంలో రష్మిక కనిపించనుందని టాక్. ఈ సినిమాను లారెన్స్ డైరెక్ట్ చేస్తూ నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమాలో బుట్ట బొమ్మ పూజా హెగ్డే నటిస్తుందని టాక్. ఆమెతో పాటు రష్మిక మందన్న నటిస్తుందని అంటున్నారు. సినిమాలో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్‌లో రష్మిక మందన్న ఉంటుందట. సో సినిమాలో రష్మిక ఘోస్ట్‌గా కనిపిస్తుందని టాక్.

—అక్షరటుడే, సినిమా డెస్క్